ప్రేమ కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ

# ముందే కూసిన కోయిల

— సింహప్రసాద్

ప్రియతమా!

నీ కోసం ఈ మూగవీణ గుండె తంత్రుల్ని శృతి చేస్తున్నాను. మౌనగోడల పరదాలని తొలగించి పిలుస్తున్నాను. నీకోసం కొట్టుకుంటోన్న ఈ ప్రేమ గుండె చప్పుళ్ళు నీకు విన్పించాలని గుండెల్ని చీల్చి ఈ కాగితం మీద పరుస్తున్నాను. రా నా జీవన నేస్తమా! నీ విశాల బాహువుల మధ్య ఈ వెన్నెల్ని బంధించు. నీ గుండె గూటిలో కోయిలగా నిలిచిపోనీ.

ఆలస్యం కాకుండానే ఈ అమృత హృదయాన్ని అంది పుచ్చుకోడానికి ముందే — పౌర్ణమికన్నా చాలాముందే ఎగిరి వచ్చేస్తావు కదూ?

నీ రాకకోసం రెప్ప వేయకుండా ఎదురుచూస్తాను మిత్రమా నా జీవన సర్వస్వమూ నా రంగుల కలల జీవమా —

— నీ
వెన్నెల

మళ్ళీమళ్ళీ చదివాను. కళ్ళమీద నమ్మకం కలగక మళ్ళీమళ్ళీ చదివాను. తెలుగు భాష మర్చిపోలేదు కదా అనుకుంటూ మళ్ళీమళ్ళీ చదివాను.

నిజం. అక్షరాలా నిజం. ఈ ఆహ్వానం పచ్చినిజం!

వేయిగొంతుల్తో నా వెన్నెల పిలుస్తోంది! ఇన్నేళ్ళ మౌనాన్ని బ్రద్దలు చేసి కోయిలరాగం ఆలపిస్తోంది!

ఇది సత్యం.

కానే కాదు స్వప్నం.

ఇది సత్యం పరమసత్యం!

ఓహ్! ఎంతదృష్టం! ఎంత ఆనందం!

గుండెలు పట్టనంత ఆనందం. గుండెలు భరించలేనంత సంబరం.

ఈ భూమ్మీదగల అత్యంత అదృష్టవంతుల్లోకెల్ల అదృష్టవంతుడ్ని కాబోతున్నాను.

వెన్నెల నా వెన్నెల నా జీవన వెన్నెల కాబోతోంది!

ఓహ్ పిచ్చెక్కిపోతోంది. పచ్చిగా పిచ్చిగా నర్తించాలన్పిస్తోంది. యావత్ ప్రపంచాన్నీ ఎడంకాలితో తన్నేసి వెన్నెలని గుండెల మీద ప్రతిష్ఠించుకుని ఎక్కడికో ఎక్కడెక్కడికో ఎగిరిపోవాలనుంది.

మోసాలూ ద్వేషాలూ కులాలూ కుట్రలూ ఆస్తులూ అహంకారాలూ లేని — వుండని స్వప్నసీమలోకి — స్వర్గలోకంలోకి ఎగిరిపోవాలనుంది.

వాట్ ఎ లక్కీ ఫెలో అయామ్!

ఎన్నడూ మూగకళ్ళతో తప్ప నోటిద్వారా ఒక్కమాటా పలకని వెన్నెల ఇప్పుడు హృదయ ద్వారం తెరచి చేతులు చాచి మరీ పిలుస్తోంది! ఆహ్వానిస్తోంది!!

వెన్నెల!

అది ఆమె పేరు కాదు. ఆమె పేరుకు మారు నేను పెట్టుకున్న పేరు.

ఆ సంగతి ఆమెకి తెలిసిన రోజున కనురెప్పల్ని టపటపలాడిస్తూ విస్మయంగా చిత్రంగా అభిమానంగా ఆనందంగా ఆమె చూసిన చూపు ఎన్ని జన్మలైనా సరే తను మరువగలడా? లేదు!

ఆ శుభదినాన...

ఎప్పట్లానే పెరట్లో మల్లె పొద ప్రక్కన పడక కుర్చీ వేసుకుని పుస్తకం తెరిచాను.

నన్ను డిగ్రీ చదివించే శక్తి మా ఆర్థిక స్థితికి లేదు. అయినా చదువుతున్నానంటే అందుక్కారణం నా పట్టుదలా బామ్మ ప్రోత్సాహమూనూ. చదువుకి తగ్గ వుద్యోగం చూసుకుని కుటుంబానికి ఆసరాగా నిలవమని నాన్న ఇంటికెళ్ళి నప్పుడల్లా పోరుతూనే వుంటారు. గ్రాడ్యుయేట్ని కావాలి పెద్ద వుద్యోగస్తుడ్ని కావాలని మా బామ్మ ఆశ. నా కల.


అందుకే ఒక పెద్దింటి వారు దయదలిచి వుచితంగా ఇచ్చిన వారి డాబా వెనుకనున్న చిన్న చీకటి కొట్టపు గదిలో ఏదో ఇంత వుడకేసుకుని తింటూ చదువుకుంటున్నాను.

నా చదువంతా ఆరుబయటే. లేకపోతే పగలు

కూడా గదిలో లైటు వేసుకోవాల్సొస్తుంది మరి.

మా రూము ప్రక్కనే ప్లీడరుగారి మేడవుంది. పై భాగంలో ఒక గది మాత్రం వుంది. అందులో వుంటూ అక్కడే చదువుకుంటూ ఆ బయటే కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటూ వుంటూం టారాయన ఇద్దరు కూతుళ్ళు.

పెద్దమ్మాయి డిగ్రీ చదువుతోంది. చిన్నమ్మాయి ఇంటర్ చదువుతోంది.



ఆ చిన్నమ్మాయే నా పాలిట పున్నమి వెన్నెల.

ఆమె చాలా బాగా పాడుతుంది. అలాగని నా చెవులకే అన్పించడమే కాదు. ఆమె స్నేహితురాండ్రూ అంటూంటారు. వీణ మీద సుస్వరాలని మనస్సుని కదిలించేట్లు పలికించగలదు. వీణ వాయిస్తూ గొంతెత్తి పాడుతూంటే సాక్షాత్తూ సరస్వతీదేవే యౌవనపు రాణిగా మారి వచ్చిందేమో అన్పిస్తుంది. పరిసరాలు కూడా అమాంతం ప్రశాంతంగా మారిపోతాయి. నేనైతే ఇహాన్నే మర్చిపోతాను.

మరో చిత్రమేమిటంటే నాకు పాత సినిమా పాటలూ కరుణశ్రీ 'పుష్పవిలాపం', శ్రీశ్రీ 'ఘుషుప్తాస్తికలు' వగైరాలు నచ్చుతాయి. ఆమెక్కూడా అంతే. అవే తరచూ పాడుతూంటుంది నా మనస్సు తెలిసినట్లు.

''నువ్వెక్కడో బీసీ కాలపు మనిషివి. 'అమ్మనీ కమ్మనీ దెబ్బ లాంటివి' పాడకుండా ఇది 'మల్లెల వేళ' అనో 'మళ్ళీ మళ్ళీ పాడాలి' అనో 'నడిరేయి రః జాములో' అనో పాడతావేంటే'' అని అప్పుడప్పుడూ ఆమె అక్క విసుక్కూంటుంది కూడా.

కావామెకి తెలీదు — ఆ పాటల్లోని ఆర్ద్రత గుండెల్ని పట్టేసే వేదన దేని కోసమో తపించే ఆర్తి ఆ పాటల్లో ఆ గుండె గొంతులో మిళితమై నా గుండెల్ని మెలిపెట్టి బలంగా ఆమెవైపు లాగుతుందని.

ఆమె మాట విన్పించని రోజు — ఆమె పాట వూపిరిపోసుకోని వారం — నాకెంతో అశాంతిగా ఆవేదనగా మరణశిక్ష విధింపబడిన ఖైదీ మనఃస్థితిలా వుంటుంది.

ప్రక్కప్రక్కనే వుంటున్నా రోజూ చూసుకుంటున్నా చూపులు చిక్కుకుంటున్నా ఎంతో అవకాశం వున్నా ఎన్నడూ మా ఇద్దర్లో ఎవరమూ కూడా పెదవి విప్పి పలకరించుకోలేదు. ఇక మనస్సు విప్పుకోడానికి ఆస్కారమేముంది గనుక!

బంధువుల పెళ్ళికి వూరికెళ్ళి వారం రోజుల తర్వాత ఆమె వచ్చిందావాళ. గది ముందున్న బాల్కనీలో కూర్చుని వీణ దుమ్ముదులిపి తీగల్ని శృతి వేసింది. గొంతువిప్పి అమృతపు సోనల్ని కురిపించింది.

''మనసున మల్లెల మాలలూగెనే...''

నా పరిస్థితి కనులారా చూసి అప్పటికప్పుడు దేవులపల్లి ఆ గీతం రచించి పాడమని ఆమెకిచ్చారేమో అన్పించేట్లుంది నా స్థితి.

మబ్బుల్ని చూసిన మయూరంలా నాట్యం చెయ్యాలన్పించింది. చేశానేమో కూడా. లేకపోతే ప్రక్కనున్న మల్లెపందిరి ఎందుకు నవ్వుతుంది! చిరుగాలి దరహాసాల్నెందుకు చిందిస్తుంది? మేఘమాలికలు ఓరగా ఎందుకు నవ్వుతాయి?

"ఓహ్! వెన్నెలా నీ అమృతపు ఝరిలో తడిసి ముద్దైపోయాను"

మరి నిగ్రహించుకోలేక గట్టిగానే అరిచాను.

ఒక్కసారే ప్రకృతి స్తంభించినట్లు ఆమె పాటా వీణానాదం ఆగిపోయాయి. వింతగా వినూత్నంగా విచిత్రంగా చూసింది. విచ్చీవిచ్చని గులాబి మొగ్గల్లా పెదవులు మందహాసం చేశాయి. ఆమె మోము అదోరకపు కాంతితో మెరిసిపోయిందొక్కసారే.

"వెన్నెలా వెన్నెలా వేనవేల నమస్సుమాంజలులు" వుద్వేగంతో గుండె లోతుల్లోంచి తన్నుకొచ్చాయి మాటలు.

ఆమె చుట్టూ చూసింది.

చిక్కగా పరచుకునుంది చీకటి.

నా సంభోదన ఎవరి మద్దేశించో అర్థమై అర్థవంతంగా ఆనందంగా సిగ్గుగా చిలిపిగా అల్లరిగా నవ్వింది.

నా మీద ముత్యాలవాన కురిసిన అనుభూతికి లోనై అమందానంత కందళిత హృదయూర విందుడనైనాను.

ఆ చూపు — ఆ నవ్వు —

నా హృదయపు కేన్వాసు మీద పదిలంగా అంటించుకున్నాను.



## మించింది

హిందీలో హిట్టయిన ఖుద్దార్‌ని తెలుగులో పునర్నిర్మిస్తోన్నారు. గోవిందాకి బదులుగా చిరంజీవి, కరిష్మాకి బదులుగా శ్రీదేవి నటిస్తున్నారు. కొన్ని పాటలకి కరిష్మా వేసుకున్న దుస్తులు, వేసిన స్టెప్స్ రివీలింగ్‌గా, వల్గర్‌గా వుంటంతో, ఆ సినిమా సంచలనం సృష్టించింది. అయితే శ్రీదేవి దుస్తుల విషయంలోగానీ, స్టెప్స్ విషయంలోగానీ కరిష్మాని మించిపోయింది.

—చెమిని

అదిగో ఆ క్షణం నుంచీ మా చూపులకి భాష వచ్చింది.

ఎన్నెన్ని మూగబాసలు గుదిగుచ్చామో ఎన్నెన్ని భావనా ప్రకంపనాలు సృష్టించామో మా గుండె రికార్డర్లకి కూడా తెలీదేమో.

మా ఇద్దరికీ తెలుసు. ఆమె ఆకాశమనీ నేను నేలయనీ మా ఇద్దరి మధ్య అధిగమించ తరంగాని అనంత దూరం వుందనీ.

ఆమె ఆస్తీ డబ్బూ పేరూ పలుకుబడీ వున్నత కుల నామమూగల ప్లీడరుగారి అమ్మాయి. అందం చందం చదువూ సంధ్యా గల వన్నె చిన్నెల బరిణె.

నేనో? ప్లీడరుగారి భూమిలోని కొంత భూమిని కౌలుకి చేస్తున్న అటు రైతూ ఇటు కూలీ కాని సన్నకారు రైతు బిడ్డని. డిగ్రీ నది మధ్యలో ఈదుతున్న వాడ్ని.

అయినా మాలో భయం ప్రవేశించలేదు. అధైర్యం ప్రవహించలేదు.


ఈ ప్రపంచాన్ని ఎదిరించి విజేతలం కాగలమన్న ధీమా మా గుండెల్నిండా వుండేది. ఎంతైనా మావి యువరక్తమూ తెల్లని మనస్సులూ కదా.

ఫైనల్ ఇయర్ పరీక్షలయ్యాయి. రూమునీ వూరినీ ఖాళీ చెయ్యాలి. మనస్సునిండా నిండిపోయి వున్న వెన్నెలకి వీడ్కోలు ఎలా ఇవ్వాలో తెలీక, సతమతమవుతూండగా నాన్న వచ్చారు. కౌలు సొమ్ము ప్లీడరుగారి కివ్వడానికొచ్చారాయన.

తనతో నన్నూ రమ్మన్నారు. వెన్నెలని దగ్గర్నుంచి చూసే భాగ్యం కలుగుతుందనే ఆశతో వెళ్ళేను.

ప్లీడరుగారు వూయల బల్లమీద వూగుతూ కూర్చున్నారు. నాన్న వంగి దణ్ణాలు పెట్టి గుమ్మం బయట గొంతుక్కూర్చున్నాడు. తల కొట్టేసినట్టుగా వుంది నాకు. అనవసరంగా వచ్చినందుకు తిట్టుకుంటూ ఎడంగా నిలబడ్డాను.

డబ్బుని గుమ్మంలోపల పెట్టేడు నాన్న. ప్లీడరుగారి భార్య దాని చుట్టూ తులసినీళ్ళు చిలకరించి డబ్బు తీసుకు వెళ్ళిపోయింది.






## ప్రేమ

"ఏవండీ, మీ ఇంట్లో ఉండే సుబ్బారావుగారూ, నేనూ ప్రేమించుకున్నాం. అతను మీ అబ్బాయా?"

"కాదమ్మా. అతను మా అల్లుడు

— కె. వెంకటరామారెడ్డి
(కొమరిపాలెం)

అప్పుడొచ్చింది హాల్లోకి వెన్నెల. నన్నూ నాన్ననీ మా పరిస్థితినీ చూసింది. ఆమె కళ్ళల్లో సన్నటి కన్నీటి పొర కదిలింది.

"అరె అక్కడే నిలబడిపోయావేం. లోపలికొచ్చి కూర్చో"

నా ఎదమీద కురిసిన పన్నీటి జల్లు ప్లీడరుగారు చూపిన కోపపు చూపుకి ఆవిరై పోయింది.

"ఇతను మన ప్రక్కింట్లో వుంటున్నాడు. మా కాలేజీలోనే చదువుతున్నాడు. బ్రిల్లియంట్ స్టూడెంట్ నాన్నగారూ".

"నువ్వు లోపలికెళ్ళు"

అరక్షణం తటపటాయించి నా వంక జాలిగా చూసి విసురుగా వెళ్ళిపోయింది. నా ప్రాణం జివ్వుమంది. 'రేయ్' అని ప్లీడరుగారి మీద వురుమై విరుచుకుపడాలన్పించింది. అయినా ఎలాగో నిగ్రహించుకున్నాను ఆయన వెన్నెల తండ్రి అవడంవల్ల.

"సిన్న పిల్ల కదండి. మంచీ సెబ్బరం తెలీవండి" నాన్న అన్నాడు.

"ఇందులో తెలీకపోడానికేముందీ ఎవరి స్థానాల్లో వాళ్ళుండాలి".

"మన కాలం ఏరు ఇయ్యాల్టి కుర్రాళ్ళ కాలం ఏరు..."

నాన్న వంక తీక్షణంగా చూశాను. నాన్న నీళ్ళు నమిలాడు.

"తాతల కాలం నుంచీ తవర్నే నమ్ముకునున్నోళ్ళం. మా పిల్లగాడిక్కూడా తవరే ఏదో దారి సూపాల. కాలేజీ సదువై పోయిందండి..."

"కులవృత్తికి సాటిరాదు గువ్వల చెన్నా అన్నారు పెద్దలు. కులవృత్తుల్ని వదిలేసి చదువులూ వుద్యోగాలూ అంటూ పోతే ఇహ వ్యవసాయాలెవరు చేయిస్తారూ. ధాన్యాలెవరు పండిస్తారు. అయినా ఈ బోడి చదువులకి వుద్యోగాలు దొరికే కాలమా ఇది. ఎందుకొచ్చిన పరుగుళ్ళూ కాళ్ళ పీకుళ్ళూ గాని కుర్రాడ్ని వ్యవసాయంలో పెట్టెయ్యి. ఇవాళ రేపు వ్యవసాయాన్ని మించింది లేదు. రొయ్యల చెరువు తవ్విద్దాం. ఇహ డబ్బే డబ్బు నీకూ నాకూ కూడా".

"తవరు రొయ్యల సెరువులు తవ్విత్తారా"



**బాధ**

"ఎందుకు సార్ ఈ బార్‌లో కూర్చుని ఎప్పుడు బాధపడ్తూ మందు తాగుతారు?" అడిగాడు గోపినాథ్‌ని తనతోపాటు తాగడాని కొచ్చిన శ్రీకాంత్.

"ఒకప్పుడు ఈ బార్‌కి నేనే ఓనర్ని!" పెగ్గు గుటుక్కున తాగి చెప్పాడు గోపినాథ్.

— వై. శ్రీనివాసరావు
(డోర్నకల్)

సృష్టిలోని ఆశ్చర్యమంతా నాన్న గొంతులో ప్రతిఫలించింది.

"తప్పేవుందీ. మేం తినమని చెప్ప మేం చెరువులు తవ్వకూడదనీ అందులో రొయ్యలు పెంచకూడదనీ లేదుగా. నీకు తెలుసో లేదో చదువుకున్న కుర్రాడికి రొయ్యల సాగుతో పోటీపడగల వుద్యోగమేదీ దొరకదు. పైగా నీ కళ్ళముందే వుంటాడు. పని తక్కువ ఫలం ఎక్కువ. ఆలోచించుకో. వచ్చే నెలలోనే చెరువులు తవ్వించేద్దామనుకుంటున్నాను".

ఆయన భావం అర్థమైంది. ఊడ్పు భూముల్ని రొయ్యల చెరువులుగా మార్చెయ్య బోతున్నారు. నేనుంటే చెరువుల బాధ్యత మాకప్పగిస్తారు. లేదంటే వేరెవరికో లీజుకిస్తారు. ఇన్నేళ్ళ నుండి ఆ పొలాన్నే నమ్ముకునున్న మా నోట మన్ను కొట్టబోతున్నారా!

నాన్న ఏదేదో చెప్పేడు. చెరువుల్ని చూసే పని తన కిమ్మన్నాడు. కొడుకు వుద్యోగాని కెళ్ళిపోయినా తన రెక్కల్లో శక్తి వుందన్నాడు. పొలం నుండి పొమ్మంటే దిక్కులేకుండా పోతామని కంట తడిపెట్టుకున్నాడు.

కిటికీలోంచి ఈ దృశ్యాన్ని చూస్తోన్న వెన్నెల్ని చూసి మరి అక్కడ నిలవలేక వచ్చేశాను.

ఆలోచిస్తానని హామీ ఇచ్చారని చెప్పేడు నాన్న.

కాని తన ఆలోచన ప్రకారమే చేసారు ప్లీడరుగారు.

చెరువులు తవ్వించి వేరే వాళ్ళకి కౌలుకిచ్చేశారు

లబోదిబోమన్న నాన్న మీద కేకలేసి నోరుమూయించారు.

ఆ దెబ్బకి నాన్నకి నడుం విరిగినట్లైపోయింది. మంచం పట్టేశారు. కుటుంబ పోషణ భారం నా మీద పడింది. హైదరాబాదు వెళ్ళి ప్రైవేటు కంపెనీలో చేరాను. తినీ తినక డబ్బు ఇంటికి పంపేను. అన్ని రకాల పోటీ పరీక్షలకీ రాత్రింబవళ్ళు ప్రిపేరయ్యాను. మమ్మల్నెంతో హీనంగా చూసిన ప్లీడరుగారి కళ్ళు చెదిరేంత వున్నత స్థాయికి చేరాలన్న ఆకాంక్ష — వెన్నెలకి దగ్గరయ్యేందుకిదొక్కటే మార్గమన్న ప్రగాఢ విశ్వాసమూ నన్ను దీక్షాబద్ధుడ్ని చేశాయి.

సర్వీస్ కమీషన్ పరీక్షలో వుత్తీర్ణుడ్నయ్యాను. యమ్మార్వోగా వుద్యోగం వచ్చింది.

ఆ వార్త చెప్పడానికి కొండంత ఆనందాన్ని మోసుకువెళ్ళిన నేను కట్టెలా మారిపోయిన నాన్నని చూసి మొదలు తెగిన వృక్షంలా కూలబడిపోయాను

కౌలు పొలం చేజారేక ఆయన కళ్ళల్లో మళ్ళీ కోటి కాంతులు చూడాలన్న నా కోరికని అసాధ్యం చేస్తూ ఆయన కనురెప్పలు మూతబడిపోయాయి శాశ్వతంగా!

కర్మకాండ పూర్తయ్యేక పట్నం వెళ్లేను. వెన్నెలని చూడాలని వెళ్ళేను. విషమ పరిస్థితులు కొలిమిలో నిలువా కాలినా నాలో మార్పు రాలేదు రాబోదని చెప్పాలని వెళ్ళాను.

చాలా ముభావంగా మాట్లాడారు ప్లీడరుగారు. నాన్న మరణవార్త విని కూడా రెండు సానుభూతి మాటలు పలకలేదు. నా గొంతువిని కాబోలు పరుగున ఒగురుస్తూ వచ్చి వాలింది వెన్నెల.

ఆమె కళ్ళల్లో ముఖంలో అణువణువులో చెప్పలేనంత వర్ణించలేనంత ఆనందం — పరమానందం — బ్రహ్మానందం!

""నాకు యమ్మార్వోగా వుద్యోగం వచ్చిందండీ. ఇదంతా మీ చలవే".

"గెజిటెడ్ ఆఫీసరువన్న మాట. చాలా సంతోషం. కూర్చో కూర్చో" ఆనందానికి అర్థంలా వెలిగిపోయిందామె మోము!

కూర్చోబోతోంటే ప్లీడరుగారు లేచారు. మరి కూర్చోలేకపోయాను.

"మంచిదోయ్" ఇహ వెళ్ళొచ్చన్నట్టు చూశారు

వెన్నెలతో ఎన్నో ఎంతో మాట్లాడాలని వుంది. గుండెల్లోని మాట విప్పి చెప్పాలని వుంది. ఈ గుండె గుడిలో దేవతవై వెలుగొందేందుకు రమ్మని చెప్పాలని వుంది. ఈ ప్రేమ తాపసికి ఎప్పుడు మోక్షం ప్రసాదిస్తావని అడగాలని వుంది. మన మూగప్రేమ గొంతు సవరించుకుని కృష్ణ శాస్త్రి కమ్మని భావగీతాన్ని కోయిల కంఠంతో పాడే తియ్యని రోజు ఎప్పుడొస్తుందో తెలుసుకోవాలని వుంది.

కాని పరిస్థితి ప్రతికూలంగా వుంది.

మాటలు గొంతులో చిక్కడిపోయాయి.

కళ్ళు బేలగా నిస్సహాయంగా చూశాయి.

నా మనసెరిగిన వెన్నెల నా భావ సంచలనాన్ని గ్రహించే వుంటుందనుకుని నిట్టూర్చాను.

నేను వుద్యోగం చేస్తున్న వూరు పేరు చెప్పి 'దయచూపాలి' అని చెప్పి వచ్చేశాను.


ఆ మాట వెన్నెలనుద్దేశించేనని ఆమె గమనించి వుంటుందని నా ఆశ.

అయినా వుండబట్టలేక రెండు మూడు ఉత్తరాలు రాశాను. ఒక ప్రేమకావ్యాన్నే సమర్పించాను. కానీ వేటికీ జవాబు రాలేదు. అసలందేయో లేదో కూడా తెలీదు. వెళ్ళి ఆమెని కలిసి నా గుండెల్ని చీల్చి అందులో ప్రతిష్ఠితమైన ఆమె విగ్రహాన్ని చూపిద్దామని ఎంతో తహతహలాడాను. కానీ పని ఒత్తిడివల్ల వీలుపడలేదు.

ఇంతలో హఠాత్తుగా మండు వేసవిలో కురిసిన చిరుజల్లులా వెన్నెల దగ్గర్నుంచొచ్చింది ఉత్తరం.

వెన్నెల పిలుస్తోంది! ప్రేమ హస్తాన్నందుకోమ్మని రా రమ్మని పిలుస్తోంది! ఇన్నాళ్ళ మౌనవ్రతానికి వీడ్కోలు చెప్పి మనసారా ప్రేమగా ఆర్తిగా పిలుస్తోంది!

వెంటనే రెక్కలు కట్టుకుని ఎగిరెళ్ళదామనుకున్నాను. అక్షరాలా వెళ్ళేవాడ్నే. కానీ ప్రాంతంలో ముఖ్యమంత్రి రాజకీయ సదస్సు పెడుతున్నందున అధికారులూ మంత్రులూ మా ప్రాంతంలో మోహరించినందున పది రోజుల వరకూ వెళ్ళడానికి వీలుపడింది కాదు.






**సహజం**

జూహీచావ్లా, రిషీకపూర్ జంటగా యాక్ట్ చేస్తుంటే మనకది యాక్షన్ అన్పించదు. వాళ్ళిద్దరూ. అంతగా ఆయా పాత్రల్లో జీవించేస్తారు. ఒకళ్ళ మీద ఒకళ్ళు బోల్డంత ప్రేమ ఒలకబోసుకుంటారు. సెట్స్‌లో కూడా అంతే! జూహీకి ఏయే దుస్తులు సూటవుతాయో రిషీ చెబ్తుంటాడు. జోక్స్ వేస్తుంటాడు. జూహీ మురిపెంగా రిషీని 'లవ్వర్ బోయ్' అని పిలుస్తుంటుంది. ఈ ముద్దు మురిపాల వల్లనేమో తెరమీద 'ప్రేమ' అంత సహజంగా కన్పిస్తుంది.

—జెమిని

ప్లీడరుగారు ఏమన్నాసరే కులాల గోడలు అడ్డుగా నిలిచినా సరే అన్నిటినీ అధిగమించి వెన్నెలని నా గుండెలకి హత్తుకోవాలనుకుని కృత నిశ్చయుడ్నై బయల్దేరాను.

ఆ వూళ్ళో రైలు దిగే సరికి చందమామ ఉదాయిస్తున్నాడు.

అంటే వెన్నెల్ని పౌర్ణమి రోజున కలవబోతున్నా నన్న మాట.

నిజంగా నా మనస్సులో మల్లెల మాల లూగాయి. మయూరాలూ నాట్యమాడాయి. సుగంధ పరిమళం సర్వత్రా వ్యాపించింది. పరిసరాలన్నీ పెళ్లికళని సంతరించుకున్నాయి. లోకం ఒక్కసారే పచ్చగా తీయని కోయిల గొంతులా కమ్మని పాటలా మారిపోయినట్లుగా వుంది!

ప్లీడరుగారింటి ముందు ఆటో దిగాను.

తేజోవిహీనంగా వున్న ఆ ఇంటిని చూసి వులిక్కిపడ్డాను. ఏదో తెలిని భయం నా గుండెల మీద కర్కశంగా నర్తిస్తోంటే గుండెల్ని చిక్కబట్టు కోడానికి వ్యర్థ ప్రయత్నాలు చేస్తూ చూశాను. శ్మశాన శాంతి ఆ ఇంట్లో తాండవిస్తున్నట్టు అనుభూతి కలిగింది. బ్రహ్మాస్త్రం తగిలిన పక్షిపిల్లలా విలవిల్లాడాను.

ప్రక్కింటావిడ — నాకు వుచితంగా గది ఇచ్చిన వాళ్ళు — బయటికొచ్చింది. గొంతుకలో సుళ్ళు తిరుగుతోన్న దుఃఖాన్ని అదిమిపట్టి వెళ్ళి పలకరించాను.

"నువ్వటయ్యా. ఎంతటివాడివయ్యావు. చాలా సంతోషం బాబూ — రా రా"

వారింట్లోకి వెళ్ళక తప్పలేదు.

ఆ కబురూ ఈ కబురూ అయ్యాక ప్లీడరుగారి చిన్నమ్మాయి గురించడిగాను.

"ఏం చెప్పమంటావు బాబూ. అంతా తలరాత"

"ఏమయ్యిందండీ"

"ప్లీడరుగారి చిన్నమ్మాయి ఎవరో కులంకాని వాడ్ని ప్రేమించిందట. ఎంత చెప్పినా ఎన్ని సంబంధాలు తెచ్చినా విన్పించుకోలేదు. కడకి అతడొస్తే మాట్లాడేక నిర్ణయించడానికొప్పుకున్నారు. ఉత్తరం రాసింది గాని అతగాడు పత్తాలేదు. అతగాడి అడ్రస్సు తీసుకువెళ్ళి అతడి శుభలేఖ తీసుకు వచ్చారు"

ఉలిక్కిపడ్డాను. "శుభలేఖా'

"అవున్నాయనా. పెద్ద ఆఫీసరయ్యాడు కదా. కలిగినింటి అమ్మాయిని రంగ రంగ వైభోవంగా పెళ్ళి చేసుకున్నాట్ట..."

ప్లీడరుగారి తెలివి ఏరకంగా, పనిచేసిందో అర్థమై పోయింది.

"ఆ తర్వాత ఏం జరిగింది"

"ఇంకేం జరుగుద్ది. ఇంకో సంబంధం ఖాయం చేశారు. ఎవరూ చూడకుండా నిద్రమాత్రలు మింగి ప్రాణాలు తీసుకుంది పిచ్చిపిల్ల!"

"ఎంత తొందరపడ్డావు వెన్నెలా!"

నా హృదయవీణ తీగలు ఫట్ ఫట్ మని తెగిపోగా కృంగిపోయాను. కుళ్ళిపోయాను. కూలబడిపోయాను.

ఆవిడేదేదో చెబుతోంది కానేమీ వినబడటం లేదు. లేచి పెరట్లోకెళ్లి ప్లీడరుగారి డాబా వంక చూశాను.

వెన్నెల్లో తడుస్తున్నాయి డాబా బాల్కనీ కూడా.

కానక్కడ వెన్నెల — నా వెన్నెల లేదు!

ముక్కలవుతోన్న గుండెల్ని చిక్కబట్టుకోలేక బావురుమన్నాను.

"ఇది మల్లెల వేళయనీ
ఇది వెన్నెల మాసమనీ
తొందరపడి ఒక కోయిల
ముందే కూసిందీ చిందులు వేసిందీ..."

ఎక్కడ్నుంచో పాట తేలి వస్తోంది.

పిచ్చి కోయిల!

మోసం ద్వేషం లేవి సీమ లేనేలేదని తెలిక నమ్మింది. మోసపోయింది!

కోయిలా! వెన్నెలా!

నా కళ్ళనుంచి రక్తాశ్రువులు ధారలుగా కారిపోతున్నాయి.

నా బ్రతుకులోంచి వెన్నెల వెళ్ళిపోయింది. ఇక మిగిలింది కృష్ణ పక్షమే.

గత కాలపు మల్లెలు వెన్నెల స్మృతులన్నీ కళ్ళముందే అగ్నికొలల్లో నిలువునా దహించుకుపోతుంటే ప్రేక్షకుడిగా పిచ్చివాడిగా చూస్తూండిపోయాను!

ఎంత దౌర్భాగ్యుడ్ని నిజంగా! ✱



## అలవాటు

ఇద్దరు రేడియో అనౌన్సర్స్ ప్రేమించుకున్నారు.

"అనివార్య కారణాలవల్ల నిన్ను నేను వివాహం చేసుకోలేకపోతున్నాను రాధా!" అన్నాడు రవి.

"వాతావరణంలో ఇంతకంటే మార్పేమీ ఉండదా?" ఆశగా అడిగింది రాధ.

"రాబోవు ఇర్వై నాలుగ్గంటల్లో నాకు పెళ్ళి నిశ్చయం కాబోతోంది. కనుక ఈ ప్రసారం ఇంతటితో సమాప్తం" అన్నాడు రవి.

— గుత్తుల శ్రీనివాసరావు
(దొంతికుర్రు)



## అశ్లీలం

'సెక్సీ సెక్సీ' డాన్స్ చేసి కరిష్మా ఎన్నో విమర్శలకి, వివాదాలకి గురయ్యింది. ఆమె డ్యాన్స్‌ని లోపల్లోపల మెచ్చుకుంటూనే ఎంతోమంది పైకి విమర్శించారు. ఒక్క పూజాభట్ మాత్రం బోల్డ్‌గా, వల్లిగ్గా కరిష్మాని మెచ్చుకుంది. 'ఆ అమ్మాయి చేయటం వల్లే ఆ డ్యాన్స్ బూతు డ్యాన్సుగా కన్పించలేదు. ఇంకెవరన్నా చేసుంటే ఎంతో అశ్లీలంగా వుండేది. కరిష్మా ది గ్రేట్—' అంది. ఎంతయినా పూజా బోల్డ్ గాల్!

—జెమిని

